ఈనాడు నిజామాబాద్
గురువారం అక్టోబరు 10, 2024 13

పునర్నిర్మాణ పనులు ప్రశంసనీయం

లింగంపేట, న్యూస్‌టుడే: భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా నాగన్న దిగుడు బావిలో చేపట్టిన పునర్నిర్మాణ పనులు ప్రశంసనీయమని కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ సభ్యులు బెంజిమన్ కరుణాకరన్, ఏఎస్ పవార్ పేర్కొన్నారు. బుధవారం లింగంపేట మండలంలోని నాగన్న బావిని వారు పరిశీలించారు. పురాతన కట్టడాల పరిరక్షణకు అవలంబించిన విధానాలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం సాధించాలి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వివిధ వర్గాలకు రుణాల పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని అదనపు పాలనాధికారి అంకిత్ సూచించారు. కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2024-25 వానాకాలం సీజన్‌కు రూ.2,640 కోట్లు పంట రుణ లక్ష్యం ఉంటే కేవలం రూ.1,011.95 కోట్లు (38.33) ఇచ్చారని, మిగతాది గడువులోపు పూర్తి చేయాలన్నారు. యాసంగిలో రూ. 1762.74 కోట్ల లక్ష్యం అధిగమించాలని చెప్పారు. కొన్ని బ్యాంకులు లక్ష్యం మేర ఇస్తుండగా, మరికొన్ని వెనుకంజలో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల్లో ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు రుణాలిచ్చి స్వయం ఉపాధికి చేయూతనివ్వాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, వీధి వ్యాపారులకు ముద్ర రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని చెప్పారు. ఆర్‌బీఐ ఏజీఎం పృథ్వీ, డీఆర్డీవో సాయాగౌడ్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, మెప్మా పీడీ రాజేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ అశోక్ చవాన్ పాల్గొన్నారు.



బ్యాంకర్లతో మాట్లాడుతున్న అదనపు పాలనాధికారి అంకిత్, చిత్రంలో డీఆర్డీవో సాయాగౌడ్, అధికారులు

మనసెరిగి మసులుకుందాం

నేడు మానసిక ఆరోగ్య దినోత్సవం

★ **బాల్యం :** అతిగా ఫోన్ల వాడకం, అతి క్రమశిక్షణ వంటివి బాలల్లో మానసిక సమస్యలకు దారి తీస్తున్నాయి. రకరకాల భయాలు, నిద్రలేమి, ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, పక్క తడపడం, అల్లరి, ప్రవర్తనా లోపాలు తలెత్తుతున్నాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

★ **విద్యార్థులు:** విద్యార్థులపై సామర్థ్యానికి మించిన అంచనాలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల అతి వాడకం, కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు లేకపోవడం, పర్యవేక్షణలేమి, నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడం వంటివి వారి మానసిక ఒత్తిడికి కారణమవుతున్నాయి.

★ **యువత:** టీనేజీలో హార్మోన్ల ప్రభావంతో కాస్త దూకుడుగా, మనసుకు నచ్చినట్లు జీవించడానికి ప్రయత్నిస్తారు. లైంగిక కోరికలు, మత్తుకు బానిస, దూకుడు స్వభావంతో చిక్కుల్లో పడటం వంటివి వారిని కుంగదీస్తున్నాయి.

★ **వివాహితులు:** వైవాహిక జీవితంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులకు తగ్గట్టు జీవించే క్రమంలో భార్యాభర్తల మధ్య ఏర్పడే వివాదాలు ఒత్తిడికి గురి చేస్తున్నాయి. విడాకులకూ దారి తీస్తున్నాయి.

★ **వృద్ధులు:** నిరాదరణకు గురవడం, సరైన పోషణ లేకపోవడం, ఒంటరితనం వంటివి వృద్ధుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయి.



మానసిక వేదన మనిషిని చెద పురుగులా తినేస్తుందంటారు పెద్దలు. అది వాస్తవమేనని మానసిక వైద్యులు చెబుతుంటారు. నిత్యం కుంగుబాటుకు గురయ్యే వారు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా అక్టోబరు 10న 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' నిర్వహిస్తోంది.

మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మానసిక రుగ్మతలకు కారణమవుతోంది. శరీర గాయానికి ఔషధం రాస్తే తగ్గిపోతుంది. కానీ మనసుకైన గాయానికి ధైర్యం, ఆత్మవిశ్వాసం, అనుబంధాలే దివ్యౌషధం. డిజిటల్ యుగంలో మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వయసుల వారీగా సమస్యలకు కారణాలు వేరైనా... మానసికంగా మాత్రం కుంగిపోతున్నారు. వివిధ కారణాలతో బలవన్మరణాలకు పాల్పడుతుంటారు.

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

జిల్లాలో ఆత్మహత్యల గణాంకాలు...

★ 2021 - 355 ★ 2022 - 339 ★ 2023 - 345

ఒత్తిడితో జీవన శైలి వ్యాధుల బాధితులు

వ్యాధి	నిజామాబాద్	కామారెడ్డి
రక్తపోటు	75,068	68,752
మధుమేహం	34,476	44,654



ఇందూరులో పరిస్థితి...

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరుగురు మానసిక వైద్య నిపుణులున్నారు. వారి వద్ద సగటున రోజుకు 40-50 మంది మానసిక రుగ్మతలతో చికిత్సకు వెళుతున్నారు. కానీ, కొంతమంది బయటకు చెప్పుకోలేక పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. అందుకే జిల్లాలో మానసిక ఆరోగ్యం, చికిత్సపై విస్తృత అవగాహన పెంపొందించాల్సిన అవసరముంది. లేదంటే ఎదురయ్యే పరిణామాలకు కొన్ని ఉదాహరణలు.

● బోధన్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ప్రైవేటులో ఉద్యోగం చేశారు. కాలక్రమంలో కుటుంబంలో జరిగిన ఘటనతో కుంగుబాటుకు గురై చివరకు మానసిక అనారోగ్యంతో తనలో తాను మాట్లాడుకోవడం, ఒంటరిగా జీవించడం అలవర్చుకున్నాడు.

● జిల్లాకు చెందిన ఓ మహిళ కుటుంబ పరిస్థితులతో కుంగుబాటుకు గురైంది. మెదడుపై తీవ్ర ప్రభావం చూపడంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింది. తాను ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియడం లేదు.

● జిల్లాకు చెందిన మరో యువకుడు విద్యావంతుడు. కానీ చదువుపైనే అధికంగా దృష్టి సారించి కుటుంబ, సామాజిక బంధాలు లేక ఒంటరిగా ఎక్కువగా గడుపుతున్నాడు. చివరకు ఆయనలో బాల్య దశ లక్షణాలు ఆవరించాయి.

● జిల్లాకు చెందిన ఒక వృద్ధురాలి పిల్లలంతా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఊళ్లోనే ఉండాలని భావించి ఒంటరిగా జీవించింది. మతిమరపు పెరిగి ఎవరినీ గుర్తు పట్టలేక చివరికి మంచం పట్టింది.

సకాలంలో వైద్యం చేయించుకోవాలి

మనిషి పైకి బాగానే కనిపించినా మానసికంగా ఆరోగ్యంగా లేకపోతే సాధారణ జీవనం గడపడం కష్టం. ఇతర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఇటీవల ప్రజల్లో మానసిక ఆరోగ్య సమస్యలపై కొంత అవగాహన పెరిగి చికిత్సకు ముందుకొస్తున్నారు. చికిత్స, కౌన్సెలింగ్‌తో వారిని సాధారణ స్థితికి తీసుకురావొచ్చు. **- డా.విశాల్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



పిల్లలు వద్దనుకునినా..!

పేదలపై ఆర్థిక భారం ● జిల్లాలో 30 వేల మంది ఎదురుచూపులు

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం, బోధన్

బోధన్ డివిజన్‌కు చెందిన నిరుపేద దంపతులు ఇద్దరు పిల్లలు చాలనుకున్నారు. కు.ని. శస్త్ర చికిత్స కోసం చూడగా ప్రభుత్వ శిబిరాలు నిర్వహించలేదు. అంతలోనే గర్భం దాల్చి మరో బిడ్డకు జన్మనివ్వాల్సి వచ్చింది. మరో జంటదీ ఇదే పరిస్థితి. ఇద్దరితో సరిపెడదామనుకుంటే నలుగురు పిల్లలు పుట్టారు.



కుటుంబ నియంత్రణ శిబిరాలు లేకపోవడంతో జిల్లాలో అవాంఛిత గర్భధారణలు పెరుగుతున్నాయి. గతంలో కు.ని. ఆపరేషన్లు చేయించుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించి ఒత్తిడి చేసేవారు. ఇప్పుడేమో ప్రజలు ముందుకొస్తున్నా శిబిరాలు నిర్వహించలేని దుస్థితి. గతంలో ఎంపిక చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏడాదికి సుమారు వెయ్యి మందికి ఉచితంగా చేసేవారు. రెండేళ్ల కిందట రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కు.ని.శస్త్రచికిత్సలు వికటించి నలుగురు మహిళలు మరణించారు. ఈ సాకుతో రాష్ట్ర వ్యాప్తంగా శిబిరాలు నిలిపివేశారు. ఈ నిర్ణయం పేదలపై ఆర్థిక భారం మోపుతోంది.

ప్రైవేటులో రూ.20 నుంచి 30 వేలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీపీఎల్ (డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపీ) శిబిరాలు నిర్వహించి కోతల్లేకుండా శస్త్రచికిత్సలు చేసేవారు. కొన్నాళ్లుగా వీటిని విస్మరించడంతో పేదలు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రాల్లో రూ.20 వేలు, జిల్లా కేంద్రంలో ఆసుపత్రి స్థాయిని బట్టి రూ.30 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. ఇది వారికి తలకుమించిన భారంగా మారింది. జిల్లా వ్యాప్తంగా రెండున్నరేళ్లలో సుమారు 30 వేల మంది కు.ని. శస్త్ర చికిత్సల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నవారు ఆశాలకు, అంగన్‌వాడీలకు ఫోన్లుచేసి ఆరా తీస్తున్నారు.

గతంలో ఇలా..


గతంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి డాక్టర్ నారాయణ డీపీఎల్ శిబిరాలు నిర్వహించేవారు. 2020లో ఆయన పదవీ విరమణ పొందారు. అప్పటి కలెక్టర్ నారాయణరెడ్డి చొరవతో కేసుకు రూ.100 చెల్లించి ఒప్పంద పద్ధతిలో శిబిరాలు నిర్వహించారు. సరిగ్గా ఏడాది కొనసాగించి 2021 డిసెంబరులో నిలిపివేశారు. ఒక్కో శిబిరంలో 40 నుంచి 50 మందికి ఆపరేషన్లు చేసేవారు. వైద్యుల ప్రోత్సాహకాలు రాకపోవడంతో క్యాంపులు నిలిపివేశారు.

ప్రోత్సాహకాలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కు.ని. ఆపరేషన్లు చేయించుకునే ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.880, ఇతరులకు రూ.660 ప్రోత్సాహకంగా అందించేవారు. ఈ డబ్బులు రవాణా భత్యం, పండ్ల కొనుగోలుకు ఉపయోగపడేవి.

ఆదేశాలు రాలేవు

డీపీఎల్ సర్జన్లు లేక పీహెచ్‌సీల్లో కు.ని. ఆపరేషన్లు చేయడం లేదు. ఉన్నతాధికారుల నుంచి శిబిరాల నిర్వహణపై ఆదేశాలు రాగానే ఎక్కడెక్కడ అవసరమో గుర్తించి నివేదిక పంపిస్తాం. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీపీఎల్ ఆపరేషన్లు చేస్తున్నాం. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలి. **- రాజశ్రీ, జిల్లా వైద్యాధికారి**




నిమజ్జనానికి ఖిల్లా రఘునాథ చెరువు వద్ద ఏర్పాట్లు

నేడు సద్దుల బతుకమ్మ

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆడపడుచులకు సకల సౌభాగ్యాలు అందించే సద్దుల బతుకమ్మను గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులుగా వివిధ రూపాల్లో కొలిచిన అతివలు వీడ్కోలు పలుకనున్నారు. చివరిరోజు అందంగా పేర్చేందుకు తీరొక్క పూలు సేకరిస్తున్నారు. అమ్మవారి గొప్పతనం, కుటుంబ అనుబంధాలు గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సందడి చేయనున్నారు. మంగళహారతులు, కోలాటాలు, డప్పునృత్యాలతో బతుకమ్మలను నిమజ్జనానికి తరలించనున్నారు. నగర శివారులోని బోర్గాం(పి)లో ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు గ్రామ కమిటీ ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రం బొడ్డెమ్మ చెరువు, పులాంగ్ వాగు, ఆర్మూర్ గూండ్ల చెరువు, జాన్కంపేట, మోర్తాడ్, భీమ్‌గల్ రాథం చెరువుల వద్ద నిమజ్జనానికి సర్వం సిద్ధం చేశారు.

కలెక్టరేట్‌లో సంబురాలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టరేట్ ఆవరణలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఆడిపాడారు. జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు కిరణ్, అంకిత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.
- ఈనాడు, నిజామాబాద్


బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఉద్యోగులతో పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ అంకిత్

ఆడబిడ్డలకు తులం బంగారం అందించాలి

బాల్కొండ, న్యూస్‌టుడే: ఆడబిడ్డల పెళ్లికి భారాస ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల కింద రూ.1,00,116లను అందజేశారని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.లక్షతో పాటు తులం బంగారం కానుకగా ఇస్తామని అప్పట్లో రేవంత్‌రెడ్డి చెప్పినా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా పెళ్లి కానుకగా వెంటనే రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలను గుర్తు చేస్తే కాంగ్రెస్ నాయకులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంపై నిందలు మోపి తప్పించుకోవడం సరికాదని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1,50,000 కోట్లు ఖర్చు చేయడానికి సర్కారు ప్రయత్నిస్తోందని, పేదల ఇళ్లు కూల్చడం తప్ప ఎవరికీ లాభం చేకూర్చలేదని ఎద్దేవా చేశారు. తహసీల్దార్ శ్రీధర్, భారాస మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, బాల్కొండ సొసైటీ ఛైర్మన్ సూరజ్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్‌లో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు భారాస, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.


బాల్కొండలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మంజూరు చేస్తే విమర్శలా: మానాల

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: భారాస హయాంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు ఇవ్వకుండా పెండింగ్ పెడితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరు చేస్తుంటే బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. తమ ప్రభుత్వం వాటిని పూడుస్తూ, ఇచ్చిన హామీలు నెరవేరుస్తోందన్నారు. భారాస నేతలకు తమను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

నేటి నుంచి మార్కెట్ యార్డుకు సెలవులు

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ఉన్నాయని సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 10న దుర్గాష్టమి, 11న మహార్నవమి, 12న దసరా, 13న ఆదివారం ఎలాంటి లావాదేవీలు ఉండవన్నారు.

గడువు పొడిగిస్తారా?

సెప్టెంబరు 30తోనే ముగిసిన సీఎంఆర్

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

రైస్ మిల్లుల నుంచి 2023-24 సంవత్సరానికి రెండు సీజన్లకు సంబంధించి కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ గడువు సెప్టెంబరు 30తోనే ముగిసింది. దీనిని పొడిగిస్తారా? లేదా? అనేది ఇంకా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయలేదు. మరోవైపు మిల్లర్లు గడువు పొడిస్తారనే ధీమాలో ఉన్నారు.

జిల్లాలో 61 బాయిల్డ్, 182 రా రైస్ మిల్లులు ఉన్నాయి. గత వానాకాలం సీజన్‌కు సంబంధించి 3,22,570 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,53,740 మె.ట. మాత్రమే సేకరించారు. యాసంగికి సంబంధించి 2,93,119 మె.ట. లక్ష్యం ఉండగా 79,639 కేవలం మె.ట. మాత్రమే సేకరించారు.


ఖానాపూర్ శివారులో మిల్లులో ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్న డీఎం రమేశ్

మొండిగా వ్యవహరిస్తున్న మిల్లర్లు

సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా 42 మిల్లులను డీఫాల్టర్‌గా ఇది వరకే అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం వారికి ధాన్యం కేటాయించొద్దు. కానీ, అప్పటి అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి కేటాయింపులు చేయడంతో ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి ఏక కాలంలో అప్పటి డీఎస్‌వో, డీఎంలపై సస్పెన్షన్ వేటు వేశారు. సదరు మిల్లులకు నోటీసులు జారీ చేసినా సీఎంఆర్ ఇవ్వడంలో మొండిగా వ్యవహరిస్తున్నారు. వారి నుంచి లక్ష్యం మేరకు బియ్యం సేకరించాలని అధికారులు పట్టుదలతో ఉన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి శ్రీముఖాలు(మెమో) జారీ చేసినా యాసంగికి సంబంధించి సీఎంఆర్ సేకరణ ముందుకు కదలడం లేదు. రెండు సీజన్లకు గడువు పొడిగింపుపై ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేశ్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

ధాన్యం వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

సీజన్	మిల్లులకు కేటాయింపు	ఇవ్వాల్సింది	ఇచ్చింది	ఇంకా రావాల్సింది	లక్ష్యం శాతం
వానాకాలం	4,75,398	3,22,570	2,53,740	68,830	78.66
యాసంగి	4,30,591	2,93,119	79,639	2,13,480	27.17

ఎస్సారెస్పీకి తగ్గిన వరద

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: ఎస్సారెస్పీకి బుధవారం ఉదయం 52,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా పది గేట్లు ఎత్తి 31,240 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు ఏఈఈ కొత్త రవి తెలిపారు. సాయంత్రానికి వరద రాక తగ్గిపోవడంతో రాత్రి 9కి మూసివేశారు. పూర్తిస్థాయిలో 1091 అడుగుల నీటినిల్వ ఉందన్నారు. కాకతీయకు 6800, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాల్వకు 150, వరద కాల్వకు 12,000, సరస్వతికి 500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.

36.10 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి..

జలవిద్యుత్తుకేంద్రంలో 4 టర్బయిన్ల ద్వారా 36.10మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తవుతోందని డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఇప్పటి వరకు 29.7027 మి.యూ. ఉత్పత్తయినట్లు చెప్పారు.

మంజీరలోకి 5 వేల క్యూసెక్కులు..

నిజాంసాగర్: నిజాంసాగర్‌లోకి ఎగువ నుంచి 5,000 క్యూసెక్కుల వరద వస్తోందని జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. జలవిద్యుదుత్పత్తి కేంద్రం సమీపంలోని గేట్ల ద్వారా 1000 క్యూసెక్కులు, ప్రాజెక్టు ప్రధాన గేట్ల నుంచి 4,000 క్యూసెక్కులు మంజీరలోకి వదిలినట్లు తెలిపారు. 1404 అడుగుల (17.687 టీఎంసీలు) నీరుందని వెల్లడించారు.

కొలువు దీరారు

ఏళ్ల కష్టం.. ఎన్నో ఓటములు.. కుటుంబ సభ్యుల త్యాగం.. సంవత్సరాల తరబడి నిరీక్షణ. వెరసి చివరకు వారు ఇష్టంగా ఎంచుకున్న ఉపాధ్యాయ కొలువులు కొల్లగొట్టారు.. కొందరు చివరి ప్రయత్నంలో విజయం సాధిస్తే.. మరికొందరు ఆర్థిక కష్టాలకు ఎదురీది అనుకున్న లక్ష్యం చేరుకున్నారు.. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఉమ్మడి జిల్లా నుంచి అభ్యర్థులు నియామకపత్రాలు అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి 465 మంది, కామారెడ్డి జిల్లా నుంచి 443 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు.



ఉమ్మడి జిల్లా డీఎస్సీ అభ్యర్థుల విజయగాథలు

● పేరు ◆ ఊరు ⊸ సాధించిన ర్యాంకు ❖ మొత్తం మార్కులు ★ పోస్ట్ కేటగిరీ ✦ ఎన్నేళ్లుగా కష్టపడ్డారు ☛ సాధించిన తీరు

పోలీసు నుంచి బోధనవైపు



● కాముసాని సౌజన్య ◆ రాజంపేట మండలకేంద్రం ⊸ 420 ❖ 68.43 ★ ఎస్జీటీ ✦ అయిదేళ్లుగా ☛ 2020లో పోలీసు కానిస్టేబుల్‌గా మాచారెడ్డి ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందే డీఎడ్ పూర్తి చేశారు. ఉన్నతాధికారుల అనుమతితో రెండు నెలలు సెలవులు తీసుకొని డీఎస్సీకి సిద్ధమయ్యారు. భర్త నవీన్ ప్రోత్సాహంతో తనకిష్టమైన ఉద్యోగం సాధించారు.

- కామారెడ్డి కలెక్టరేట్

ట్యూషన్లు చెబుతూ..



● తెప్పల శ్రీకాంత్ ◆ బీర్కూర్ మండలకేంద్రం ⊸ 31 ❖ 80.13 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా. ☛ కుటుంబ ఆర్థిక స్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో ఒకవైపు ట్యూషన్లు చెబుతూ వచ్చిన డబ్బులతో కావాల్సిన మెటీరియల్ కొనుగోలు చేశారు. నిత్యం 6 గంటలు శ్రమించి కొలువు సాధించారు.

- న్యూస్‌టుడే, బీర్కూర్

మూడు నెలల్లో రెండు..



● షిండే సచిన్ పాటిల్ ◆ గాంధారి మండలకేంద్రం ⊸ జిల్లాస్థాయి మొదటి ర్యాంక్, ❖ 80.70/100 ★ ఓపెన్, స్కూల్ అసిస్టెంటు(ఆంగ్లం) ✦ నాలుగేళ్లుగా ☛ పేద కుటుంబం. 2000లో బీఈడీ పూర్తిచేసి పదేళ్లుగా ప్రైవేటులో బోధిస్తున్నారు. తానే సొంతంగా నోట్స్ రాసుకొని, దినపత్రికల్లో వచ్చిన విషయాలు అభ్యసనం చేశారు. మూడు నెలల కిందట గురుకుల టీజీటీ వచ్చింది.

- న్యూస్‌టుడే, గాంధారి

ఉదయం విధులు.. రాత్రి చదువు



● మండాజీ శ్రీకాంత్ ◆ దూద్‌గాం, మెండోరా మండలం ⊸ 18 ❖ 78.73 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా ☛ ఆర్టీసీ నిజామాబాద్- 1 డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో లేకపోవడంతో ఏదో అసంతృప్తి ఉండేది. నిత్యం విధులు నిర్వర్తిస్తూ.. అలిసిపోయి ఇంటికొచ్చినా రాత్రిపూట తప్పక చదివేవారు. చివరికి తన కల సాకారం చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, బాల్కొండ

ఆయన విజయం వెనక ఆమె



● సత్యనారాయణ ◆ జాగిర్యాల్, భీమ్‌గల్ మండలం ⊸ 8వ ❖ 72.07 ★ స్కూల్ అసిస్టెంట్ (సోషల్, ఓపెన్) ✦ మూడేళ్లుగా ☛ 2013-15లో డీఎడ్, 2019-21 బీఎడ్ పూర్తిచేశారు. 2018, 2023లో గురుకుల టీజీటీ ఉద్యోగం చేజారింది. ప్రేమ పెళ్లి చేసుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఆయన భార్య నాగశ్రీ ఓ ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ కుటుంబ పోషణ చూసుకునేది. ఆమె సహకారం ఆయనను విజయ తీరాలకు చేర్చింది.

- భీమ్‌గల్ గ్రామీణం

అన్నలే ఆదర్శంగా..



● అబ్బెంద ప్రతాప్‌గౌడ్ ◆ బాన్సువాడ పట్టణం ⊸ 24 ❖ 81.37 ★ ఎస్జీటీ (తెలుగు) ✦ మూడేళ్లుగా.. ☛ ఇద్దరు అన్నలు ఉపాధ్యాయులు కావడంతో వారిని ఆదర్శంగా తీసుకొని సొంతంగా సన్నద్ధమయ్యారు. ఉత్తమ ర్యాంకు సాధించి ఆదర్శంగా నిలిచారు.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

లారీ వదిలి.. పెన్ను పట్టి



● సాయిలు ◆ పెద్దకొడప్‌గల్ మండలకేంద్రం ⊸ 23 ❖ 63.47 ★ స్కూల్ అసిస్టెంట్(భౌతికశాస్త్రం) ✦ రెండేళ్లుగా ☛ రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. స్థితిగతులు మారాలంటే సర్కారు కొలువులు కొట్టాలని గట్టిగా నమ్మారు. 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కానీ, తనకు ఇష్టమై ఉపాధ్యాయ వృత్తిపై మమకారం పెంచుకొని రెండేళ్లుగా పుస్తకాలతో కుస్తీ పట్టి చివరకు అనుకున్నది సాధించారు.

- పెద్దకొడప్‌గల్

అమ్మ కల నెరవేరిన వేళ



● యోగేష్ ◆ బాన్సువాడ పట్టణం ⊸ 132 ❖ 75.7 ★ ఎస్జీటీ ✦ రెండేళ్లుగా ☛ 2014లో డీఎడ్ పూర్తిచేశారు. ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ వీలు చిక్కినప్పుడల్లా గ్రంథాలయంలో చదువుకునేవారు. తండ్రి చనిపోవడంతో తల్లి కూలీ పనులకు వెళ్లి కుమారుడికి అండగా నిలవడంతో విజయ తీరాలకు చేరారు.

- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

చిన్నతనం నుంచి కుటుంబబాధ్యతలు మోస్తూ..



● న్యామతాబాద్ సంతోశ్ ◆ బీబీపేట మండలకేంద్రం ⊸ 2 ❖ 61.57 ★ స్కూల్ అసిస్టెంట్(హిందీ పండిత్) ✦ 8 ఏళ్లుగా ☛ పదేళ్ల వయస్సున్నప్పుడు సంతోశ్ తండ్రి మరణించారు. అప్పటి నుంచే కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. ఉదయం బడికి వెళ్లి సాయంత్రం మాంసం దుకాణం నడిపే వాడు. 2017లో 1:3 నిష్పత్తిలో ఎంపికైనా ఉద్యోగం రాలేదు. అయినప్పటికీ ఏమాత్రం నిరాశ చెందకుండా మరింత సాధన చేసి కొలువు సాధించారు.

- న్యూస్‌టుడే, బీబీపేట

20 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలలో...



● పన్యాల జ్యోతి ◆ దోమకొండ మండలకేంద్రం ⊸ 18 ❖ 69.23 ★ స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ✦ రెండేళ్ల నుంచి ☛ 20 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలలో బోధిస్తూ నిర్వహణ చూసుకున్నారు. ఆమెకు 43 ఏళ్లు. ఆఖరు నిమిషంలో ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం సాధించింది. గత నెలలో జ్యోతిబా ఫులే గురుకుల ఉపాధ్యాయురాలిగా ఎంపిక కాగా.. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, దోమకొండ

ఎనిమిదో ప్రయత్నంలో వరించెన్



● ఉషాకిరణ్ రాజు ◆ దుబ్బ, నిజామాబాద్ ⊸ 18 ❖ 68.80 ★ స్కూల్ అసిస్టెంటు, సాంఘికశాస్త్రం ✦ నిజామాబాద్ గంజ్‌లో తండ్రి హమాలీ పనిచేస్తూ చదివించారు. 2018 డీఎస్సీలో 1:2 నిష్పత్తి జాబితాలో ఉన్నా ఉద్యోగం రాలేదు. 2022లో కేంద్రీయ విద్యాలయం పీఆర్టీ ఉద్యోగం రెండు మార్కులు, టీజీటీ ఒక మార్కుతో దూరమైంది. 2023లో ఏకలవ్య గురుకులంలో టీజీటీ 0.25 మార్కులు, గురుకుల టీజీటీ 0.3 మార్కులతో చేజారింది. 2023 గ్రూప్-4లో 1:2 నిష్పత్తికి, హెచ్‌డబ్ల్యూవోలో 1:3 నిష్పత్తికి అర్హత సాధించినా ఉద్యోగం రాలేదు. ఏడు సార్లు త్రుటిలో తప్పినా కుంగిపోకుండా ఈ సారి కష్టపడి కొలువు పట్టారు.

- నిజామాబాద్ విద్యావిభాగం

గొర్ల కాపరి.. గురువుగా మారి



● కోరే కుమార్ ◆ భిక్కనూరు ⊸ 12 ❖ 70.93 ★ స్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం) ☛ 5వ తరగతి వరకు చదివి, ఆర్థిక పరిస్థితులు బాగోలేక మానేసి గొర్ల కాపరిగా మారారు. 10వ తరగతి ప్రైవేటులో పరీక్ష రాసి పాసయ్యారు. ఇంటర్‌లో సీఈసీ, గొర్లు కాస్తూ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత పీజీ నిజాం కళాశాలలో, ఆ తర్వాత బీఈడీ పూర్తి చేశారు. పీజీ చేసే సమయంలో ఎస్సై, గ్రూప్స్‌కు సన్నద్ధం కావడంతో అది డీఎస్సీకి ఉపయోగపడింది. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా.. గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతానని కుమార్ తెలిపారు.

- న్యూస్‌టుడే, భిక్కనూరు



నిజామాబాద్ నుంచి బస్సులో హైదరాబాద్ బయలుదేరిన డీఎస్సీ-2024 అభ్యర్థులు

సూటిపోటి మాటలు తట్టుకొని..



● ఎల్. నిశిత ◆ సారంగాపూర్, నిజామాబాద్ గ్రామీణ మండలం ⊸ 61 ❖ 74.90 ★ ఎస్జీటీ ✦ అమ్మానాన్న, భర్త ప్రోత్సాహంతో ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దే సిద్ధమయ్యారు. బంధువుల సూటిపోటి మాటలు తట్టుకుంటూనే ప్రైవేటులో బోధిస్తూ చివరకు విజయం సాధించారు.

- నిజామాబాద్ విద్యావిభాగం

నాడు కానిస్టేబుల్.. నేడు ఉపాధ్యాయురాలు



● ఎం. సౌమ్య ◆ రావుట్ల, సిరికొండ ⊸ 100 ❖ 73.03 ★ ఓపెన్ కేటగిరీ ✦ రెండేళ్లుగా ☛ గతేడాది అక్టోబరులో భర్త సుమన్ సహకారంతో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. ఉపాధ్యాయురాలు కావాలనే లక్ష్యంతో మరింత కష్టపడి చదివి ఎస్జీటీ సాధించారు. ఏడాదిలోపే రెండు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, సిరికొండ

రెండు దశాబ్దాల నిరీక్షణ



● బండి రాజులు ◆ గాంధారి మండల కేంద్రం ⊸ జిల్లాస్థాయిలో 19వ ర్యాంక్, బీసీ-బీలో 2వ ర్యాంక్ ❖ 69.33 ★ బీసీ-బీ ✦ 20 ☛ 2001లో అర్థశాస్త్రంలో పీజీ, 2004లో బీఈడీ (సాంఘిక) పూర్తి చేశారు. 19 ఏళ్లపాటు ప్రైవేటు స్కూల్ నడిపారు. తర్వాత హైదరాబాద్‌లో ఓ పాఠశాలలో బోధిస్తున్నారు. పలు పోటీ పరీక్షలతో పాటు గత డీఎస్సీల్లో ఒకటి, అర మార్కుల తేడాతో, 1:2 నిష్పత్తిలో ఉద్యోగాలు కోల్పోయారు. అయినా పట్టు వీడకుండా చివరి ప్రయత్నంలో ఉపాధ్యాయ కొలువు సాధించారు.

- న్యూస్‌టుడే, గాంధారి

నాలిగింటిని వదులుకొని..



● సంత రాధిక ◆ హాసాకొత్తూరు, కమ్మర్‌పల్లి (ప్రస్తుతం నిజామాబాద్‌లో ఉంటున్నారు) ⊸ 6 ❖ 77.07 ★ స్కూల్ అసిస్టెంట్(గణితం) ✦ 8 ఏళ్లుగా ☛ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన రాధిక చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి నర్సు అన్ని తానై చదివించారు. బీఈడీ పూర్తికాగానే పెళ్లికావడంతో చదవడం ఇబ్బందైంది. అటు కుటుంబ పోషణ ఇటు చదువు రెండింటినీ కొనసాగించారు. పంచాయతీ కార్యదర్శి, వసతి గృహ సంక్షేమాధికారి గ్రేడ్-2, గ్రూప్-4 ఉద్యోగాలు సాధించినా బోధనపై మమకారంతో డీఎస్సీలో విజయం సాధించారు.

- న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

కుటుంబీకుల సాయం.. కల సాకారం



● న్యామ్తాబాద్ పూజితరాజ్ ◆ స్టేషన్ ఏరియా, డిచ్‌పల్లి మండలం ⊸ 116 ❖ 72.53 ★ ఎస్జీటీ ✦ ఆరేళ్లుగా ☛ నాలుగో తరగతిలో ఉన్నప్పుడే తండ్రి మృతి చెందారు. ఇద్దరు బాబాయిలు, నానమ్మ అండగా నిలబడి చదివించారు. 2015లో డీఎడ్ పూర్తి చేసి పరీక్షకు సన్నద్ధమయ్యారు. పెళ్లైనా భర్త సహకారంతో చదివారు. గురుకులంలో పీజీటీ పోస్టుకు ఎంపికైనా చివరి క్షణంలో ఉద్యోగం చేజారింది. ఈ సారి మరింత పట్టుదలతో చదివి ఉద్యోగం కొట్టారు.

- నిజామాబాద్ అర్బన్

మెకానిక్ భర్త ప్రోత్సాహం



● మంగళిపల్లి రోహిణి ◆ గుండారం, రాజంపేట మండలం ⊸ 57 ❖ 78.57 ★ ఎస్జీటీ ✦ 12 ఏళ్లుగా ☛ భర్త పురుషోత్తం కామారెడ్డిలో ద్విచక్రవాహన మెకానిక్. భర్త ప్రోత్సాహంతో 2012 నుంచి సన్నద్ధమవుతున్నారు. 2012, 2017 డీఎస్సీలో కొద్ది తేడాతో విఫలమయ్యారు. 12 ఏళ్లుగా అవనిగడ్డ, మెదక్, కామారెడ్డి తదితర చోట్ల ప్రిపరేషన్‌కు వెళ్తే భర్తే పిల్లలను చూసుకోవడంతో చిరకాల స్వప్నమైన ఉద్యోగం సాధించారు.

- న్యూస్‌టుడే, రాజంపేట

కూరగాయలు విక్రయిస్తూ..



● జి.రవి ◆ పెద్దవాల్గోట్, సిరికొండ ⊸ 84 ❖ 73.73 ★ ఓపెన్ ఎస్జీటీ ✦ 12 ఏళ్లుగా.. ☛ 2014లో డీఎస్సీ, 2023లో కానిస్టేబుల్ పరీక్షల్లో కొద్ది మార్కుల తేడాతో అవకాశం కోల్పోయినా అధైర్యపడలేదు. కుటుంబ పోషణకు ఒకవైపు కూరగాయలు విక్రయిస్తూనే.. మరోవైపు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ సాధించారు. తన 12 ఏళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కింది.

- న్యూస్‌టుడే, సిరికొండ

దుబాయికి వెళ్లిపోమన్నారు



● తోట మహేష్ ◆ అమీర్‌నగర్, మండలం: కమ్మర్‌పల్లి ⊸ 4 ❖ 81.97 ★ ఎస్జీటీ ✦ 2013లో డీఎడ్ పూర్తయింది. కష్టపడి చదివినా 2018 డీఎస్సీ మిస్సయింది. వ్యవసాయ పనులు చేసుకుంటూనే 9 పోటీ పరీక్షలు రాసినా ఎందులోనూ ఫలితం రాలేదు. బంధువులు, స్నేహితులు నీకు ఉద్యోగం రాదు దుబాయి వెళ్లిపోమన్నారు. ఈ సారి తల్లిదండ్రుల సహకారంతో మరింత కష్టపడి ఉద్యోగం సాధించా.


- న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

ప్రత్యేక కమిటీలతో ప్రచారం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే బాలోత్సవం విజయవంతం చేసేందుకు రెండు ప్రత్యేక కమిటీలతో విస్తృత ప్రచారం నిర్వహించాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. నగరంలోని ట్రస్ట్ భవనంలో బుధవారం నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారానికి ఒకటి, పత్రికలు, టీవీల్లో ప్రచారానికి మరో కమిటీలను ఏర్పాటుచేయాలని సంకల్పించారు. పండగ తర్వాత పూర్తిస్థాయిలో కమిటీలు పనిచేస్తాయన్నారు.



సమావేశమైన బాలోత్సవం కమిటీ ప్రతినిధులు



ఎండు ఫలాలతో అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని దేవీమాతను విశేషంగా అలంకరించి భక్తిని చాటుకుంటున్నారు. జిల్లాకేంద్రం కిషన్‌గంజ్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం కాళరాత్రిగా దర్శనమిచ్చిన అమ్మవారికి వంద కిలోల ఎండు ఫలాలతో అలంకరించారు. ఇందుకు రూ.75 వేలు వెచ్చించినట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

30లోపు దరఖాస్తులకు అవకాశం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు, పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8న ఉంటుందని, వివరాలకు ప్రిన్సిపల్ (9701907749)ను సంప్రదించాలని సూచించారు.

అంతర్జాతీయ ఉషూ పోటీలకు ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఉషూ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 17 నుంచి 22 వరకు జార్జియాలో నిర్వహించే బాటుమీ ఓపెన్ ఇంటర్నేషనల్ ఉషూ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ఆకాంక్ష యాదవ్, సాయి దీక్షిత్, ఫరియాఖానం పాల్గొననున్నారు. దేశం నుంచి వివిధ కేటగిరీల్లో 26 మంది ఎంపికకగా అందులో జిల్లా నుంచి ముగ్గురు ఉండటం అభినందనీయమని శిక్షకుడు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమెర్ అన్నారు.



ఆకాంక్ష యాదవ్



సాయిదీక్షిత్



ఫరియాఖానం

యంచలో బీజాక్షర క్షేత్రం

నవీపేట, న్యూస్‌టుడే: యంచ శివారులో వేద భారతి పీఠం వ్యవస్థాపకుడు విద్యానందగిరి స్వామి బీజాక్షర క్షేత్రం ఏర్పాటు చేశారు. బుధవారం సరస్వతీమాత మూల నక్షత్రం పురస్కరించుకుని స్వామివారు పలువురు చిన్నారుల నాలుకపై బీజాక్షరాలు రాశారు.



‘ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో నష్టం’

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో ఇతర వర్గాల అభ్యర్థులకు నష్టం వాటిల్లిందని వక్తలు అభిప్రాయపడ్డారు. కామారెడ్డిలో బుధవారం ఆయా పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అగ్రవర్ణ పేదలకు 10 శాతం ఏ ప్రాతిపదికన అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదన్నారు. బీవీఎస్ రాష్ట్ర నాయకుడు విఠల్, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల బాబు, బామ్‌సెఫ్ రాష్ట్ర కార్యదర్శి నరేందర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సిద్ధిరాములు, ప్రతినిధులు తదితరులున్నారు.



కామారెడ్డిలో సమావేశమైన ప్రతినిధులు

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

కొనుగోలు కేంద్రం ప్రారంభం



తూకం వేస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

పోతంగల్, న్యూస్‌టుడే: సోయా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. పోతంగల్ విండో ఆధ్వర్యంలో హెగ్డోలిలో బుధవారం సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. రుణమాఫీపై రైతులు ఆందోళన చెందొద్దని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ హన్మంతు, పోతంగల్ విండో అధ్యక్షుడు శంభోశ్వర్ ఉన్నారు.

పరిశోధన కేంద్రం సందర్శన

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: దేశీ(డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్) శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా శిక్షణ డీలర్లు పటాన్‌చెరులోని ఇక్రిశాట్ పరిశోధన కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వివిధ రకాల మూల విత్తనాలు, వర్షపు నీటిని సేకరించి పంటను పండించే విధానం, బయోటెక్ గురించి తెలుసుకున్నారు. ఫెసిలిటేటర్ అమరేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.



పటాన్‌చెరువులో పరిశోధన కేంద్రంలో డీలర్లు

ఈనాడు సినిమా

ఉప్పాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: వెట్టయాన్
1.10, 4.20, 7.25, 10.30(రాత్రి)
స్క్రీన్-2: దేవర పార్ట్-1
10.30, 1.25, 4.30, 7.40, 10.45(రాత్రి)
స్క్రీన్-3: వెట్టయాన్ 10.30
శ్వాగ్: 1.35, 4.40, 10.50(రాత్రి)
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: దేవర పార్ట్-1
11.15, 2.50, 6.25, 10.00(రాత్రి)
స్క్రీన్-2: వెట్టయాన్
11.50, 3.20, 6.50, 10.20(రాత్రి)
స్క్రీన్-3: శ్వాగ్: 12.00, 6.40
సత్యం సుందరం: 3.20, 10.00 (రాత్రి)
స్క్రీన్-4: బహిర్భూమి: 11.05
మిస్టర్ సెలబ్రిటీ 1.45 చిట్టి పొట్టి 4.30 దక్షిణ 7.30
జోకర్ ఫోలీ ఏ డిలక్స్ (ఇంగ్లిష్) 10.00(రాత్రి)
దేవి (ఎస్వీసీ): శ్వాగ్ 11.15, 2.15, 6.15, 9.15 (రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): సత్యం సుందరం
11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I
10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): వెట్టయాన్
11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

☛ దుబ్బ పవన్‌నగర్‌కు చెందిన శంకర్ జలుబు, గొంతునొప్పి, జ్వరంతో బాధపడుతున్నారు. ఆసుపత్రికి వెళ్లే రక్త పరీక్ష చేసి వైరల్ జ్వరం అని చెప్పారు. మూడు రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందడంతో జ్వరం నయమైంది కానీ, ఒళ్లు నొప్పులు మాత్రం తగ్గలేదు.

☛ గౌతంనగర్‌కు చెందిన రవిదీ ఇదే పరిస్థితి. జ్వరం రావడంతో ఆసుపత్రిలో చూపించారు. జ్వరం తగ్గి నేటికి 27రోజులు అవుతున్నా ఇప్పటికీ కాళ్లు, కండరాలు, కీళ్ల నొప్పులు తగ్గలేదు.

ఒంటి నొప్పుల బాధ ఇంతింతగాదయా

న్యూస్‌టుడే, నిజామాబాద్ వైద్యవిభాగం

● జ్వరం తగ్గినా రెండు నెలల వరకు ప్రభావం



ఉమ్మడి జిల్లాలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలు తగ్గు ముఖం పట్టినా నొప్పులు మాత్రం మానడం లేదు. ఇంట్లో ఒక్కరికి వస్తే అందరికీ సోకుతున్నాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు వ్యాధుల బారిన పడుతున్నారు. పురుషులు, స్త్రీలు, వృద్ధులు అనే తేడా లేకుండా అందరూ ఇబ్బంది పడుతున్నారు.

రోజులుగా అవస్థ..

జ్వరం, కీళ్లనొప్పులు అంటే మొదట గన్యా జ్వరం పాజిటివ్ వచ్చేది. ప్రస్తుతం వ్యాధి లక్షణాలు ఉన్నా నిర్ధారణ కావడం లేదు. 100 మందిలో 10 మందికి చికున్ గన్యా పాజిటివ్ రాగా మిగిలిన వారికి నెగెటివ్ వస్తుంది. కొందరికి దగ్గు, మరికొందరికి జలుబుతో జ్వరాలు ప్రారంభమవుతున్నాయి. మరి సటిరోజు తీవ్రజ్వరం, కండరాల నొప్పులు, ఒళ్లునొప్పులతో ఇబ్బంది పడుతున్నారు. చికున్ గన్యా పాజిటివ్ వచ్చిన వారికి మాత్రం రెండు నెలల వరకు నొప్పులు పోవడం లేదని వైద్యులు వివరించారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజశ్రీ మాట్లాడుతూ... గన్యా జ్వరం పాజిటివ్ తక్కువే. లక్షణాలు మాత్రం అలాగే కనిపిస్తున్నాయి. శరీరంలో నీరు తగ్గకుండా చూసుకోవాలి. జ్వరం మందులు, కాల్షియం మాత్రలు వేసుకోవాలి. ఒళ్లు నొప్పులు ఉన్నాయని నొప్పుల మాత్రలు వాడొద్దు.

సిరుల బతుకమ్మ మా ఇంటి వెలుగమ్మ

జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఉయ్యాల పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం నిమజ్జనం నిర్వహించారు.
– న్యూస్‌టుడే, బృందం:



నిమజ్జనానికి తీసుకెళ్తూ..

రావుట్లలో..

బాల రక్షణ భవన్‌లో.

డిచ్‌పల్లి మానవతాసదన్‌లో బతుకమ్మ సంబరాలు

కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉద్యోగులు..

అమెరికాలో దైవ జ్ఞాన ప్రచారం

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: అమెరికాలోని జార్జియా అట్లాంటాలో బోధన్‌కు చెందిన సభ్యులు దైవ జ్ఞాన ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూరు జ్ఞాన వేదిక బోధన్ సభ్యులు అక్కడ ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచారం చేసినట్లు ప్రకటనలో తెలిపారు. వెంకటరమణ, వనజ, లలిత, రుద్ర పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048



స్పందనకు వందనం

సాలూరలోని 13వ వార్డులో వాటర్ ట్యాంక్ పైప్‌లైన్ లీకేజీ కావడంపై స్థానికుడు సయ్యద్ ఈనాడు దృష్టికి తేగా పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ స్పందించి మరమ్మతులు చేయించారు.
-సాలూర, న్యూస్‌టుడే

సమస్య: ముబారక్‌నగర్ పరిధిలోని మహాలక్ష్మినగర్ కాలనీలో వీధి దీపాలు వెలగక రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నాం.
- కిరణ్, స్థానికుడు

సమాధానం: క్షేత్రస్థాయికి సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. **- పావని, జోన్-I, ఏఈ, నగరపాలక సంస్థ**

సమస్య: న్యూఎన్జీవోస్ కాలనీ సుభాష్‌నగర్ (పోల్ నెం. ఆర్‌బీఎఫ్ 54/ఎల్‌వో4)లో మాజీ కార్పొరేటర్ ప్రవీణ్ గౌడ్ ఇంటి ఎదుట వీధి దీపం వెలగడం లేదు. ఈ ప్రాంతంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. **- మునీంద్రాచారి, న్యూఎన్జీవోస్ కాలనీ**

పరిష్కారం: పిచ్చిమొక్కలు వెంటనే తొలగిస్తాం. ఏఈతో మాట్లాడి వీధి దీపం ఏర్పాటు చేస్తాం.
- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు

సమస్య: దుబ్బ చౌరస్తాలో కొత్త కలెక్టరేట్ మార్గంలో చెత్త, వ్యర్థాలు పారేస్తున్నారు. **- విష్ణువర్ధన్‌రెడ్డి, దుబ్బ**

పరిష్కారం: చెత్త, వ్యర్థాలు పారేయకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **- ప్రశాంత్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

– న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్
నిజామాబాద్ నగరం

లోకాలనేలే.. ఓంకార రూపిణి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.
న్యూస్‌టుడే, బృందం



బోధన్ సరస్వతీనగర్ నల్ల పోచమ్మ ఆలయం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జిల్లాకేంద్రం ఈస్ట్‌బ్యాంకు కాలనీలో హోమం చేస్తూ..

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

వర్ని మండలం వకీల్‌ఫారంలో

రెంజల్ మండలంలో..

లలితాదేవి ఆలయంలో అమ్మవారి లడ్డూను వేలంలో రూ.51,116కు దక్కించుకున్న అనిరుద్‌రెడ్డి

తేనెసాయి మందిరంలో...

నవీపేట: సరస్వతీ మాతగా దుర్గాదేవి

గంగాస్థాన్ -2లో..

బోధన్ పట్టణం: శక్కర్‌నగర్ త్రిశక్తి ఆలయ ప్రాంగణంలో..

ఎడపల్లిలో అమ్మవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

సుద్దపల్లిలో దుర్గామాత మండపం వద్ద యజ్ఞం చేస్తూ..

గోడ ప్రతుల ఆవిష్కరణ

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే : కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం అవసరమని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తెన్న, సుధాకర్ తెలిపారు. నగరంలోని శ్రామికనగర్‌లో బుధవారం ఐఎఫ్‌టీయూను టీయూసీఐలో విలీనం చేసిన ప్రచార గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ ఉంటుందని, అన్ని రంగాల కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ ప్లాట్లను విక్రయిస్తున్నారు’

ధర్పల్లి, న్యూస్‌టుడే: ధర్పల్లి రామారావు కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఉన్న ప్లాట్లను కొంతమంది కబ్జా చేసి విక్రయిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి బాలయ్య బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. అప్పటి తెదేపా ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ప్లాట్లను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్లాట్లను ఇప్పించాలని నిజమైన లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు నిమ్మల భూమేష్, సంజీవ్ తదితరులున్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కోటగిరి, న్యూస్‌టుడే: అత్యవసర పరిస్థితుల్లో రోగులకు 108 వాహనం ద్వారా మెరుగైన సేవలు అందించాలని జిల్లా మేనేజర్ శ్రీకాంత్ సూచించారు. కోటగిరిలో బుధవారం వాహనం పని తీరు, కేసుల వివరాలు ఆరా తీశారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పెంటాఖుర్దు జడ్పీ పాఠశాలలో చదివిన 1999- 2000 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల బుధవారం సాలూర మండలం కొప్పర్తిక్యాంపులోని కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శ్రీనివాసరావు, దుర్గారావు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో చిన్నపాటి సాంకేతిక సమస్యలతో 1:1 జాబితాలో చోటు దక్కని వారి సమస్యలు విని, సరైన సమాధానం తెలిపేందుకు అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి వస్తున్నారని, ఇందుకు ప్రత్యేక సహాయకేంద్రం ఏర్పాటు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడిన ఆయన సమస్యను డీఈవో దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగుల కోటాలో నష్టం వాటిల్లిందని, ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనా ఆన్‌లైన్‌లో గైర్హాజరైనట్లు చూపుతున్నారని పలువురు బాధితులు బుధవారం డీఈవో కార్యాలయానికి వస్తే సిబ్బంది సరిగా స్పందించలేదని పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

కాన్షీరాం వర్ధంతి

నిజామాబాద్ గ్రామీణం, రుద్రూర్, ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే : కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు ప్రేమ్, జిల్లా కమిటీ సభ్యులు ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ మండలం జలాల్‌పూర్ గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు బుధవారం బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గణేష్, సభ్యులు అశోక్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌ఛార్జి ఈశ్వర్, కార్యదర్శి శామ్, మండల అధ్యక్షుడు గౌతం తదితరులు ఉన్నారు.



కాన్షీరాం విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న యువజన సంఘం సభ్యులు



ధర్మసమాజ్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో..

దుస్తుల పంపిణీ



దుస్తులు అందుకున్న వారితో సబ్ కలెక్టర్

బోధన్ పట్టణం: పట్టణానికి చెందిన రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అనాథలకు దుస్తులు పంచారు. సబ్ కలెక్టర్ వికాస్ మహతో చేతుల మీదుగా వాటిని అందజేశారు. డీలర్లు లింగం, రాజు, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

బోధన్ పట్టణం, బోధన్ గ్రామీణం, రెంజల్ న్యూస్‌టుడే: బోధన్ పట్టణంలో లబ్ధిదారలకు బోధన్ బల్దియా కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ విఠల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నాయకులు పాషా, శరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు. సాలూరలో తహసీల్దార్ శశిభూషన్, రెంజల్‌లో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆర్ఐ రవి, నాయకులు మోబిన్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: బోధన్ పట్టణాభివృద్ధి కమిటీకి నిర్వహించిన పోలింగ్ బుధవారం ముగిసింది. అధ్యక్షుడిగా గంగాధర్‌రావుపట్వారీ ఎన్నికయ్యారు. కమిటీకి ఆయన 1962 నుంచి 2020 వరకు అధ్యక్షుడిగా వ్యవహరించగా నాలుగేళ్ల విరామం వచ్చింది. తిరిగి ఆయనే ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బీర్కూర్ శంకర్, కోశాధికారిగా శ్రీను, ఉపాధ్యక్షులుగా లింగం, సాయిలు, కార్యదర్శిలుగా పోశెట్టి, సంగ్రాం ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు అధికారులుగా పోశెట్టి, లోల శంకర్, ఎంబెల్లి శంకర్ వ్యవహరించారు.

రాష్ట్ర కార్యవర్గంలో పలువురికి చోటు

రెంజల్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో రెంజల్ మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సోమలింగంగౌడ్, కార్యదర్శి కిషోర్ తెలిపారు. ఈ.శంకర్(నీలా), నరసింహారెడ్డి(బోర్గాం), కృష్ణ(దూపల్లి), సాయిబాబా(నీలా), నాందేవ్(రెంజల్), శంకర్(అంబేడ్కర్ నగర్), సునిల్‌కుమార్(తాడ్‌బిలోలి), శ్రీరాంనాయక్(నీలా), అయ్యూబ్(నీలా)కు చోటు దక్కినట్లు చెప్పారు. సాటాపూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు గోవర్ధన్‌కు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్ష పదవి దక్కడంతో ఆయనను స్థానికులు నితీన్, ఎకార్‌పాషాతో పాటు గ్రామస్థులు బుధవారం సన్మానించారు.

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ మండలానికి చెందిన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించినట్లు సంఘం మండల అధ్యక్షుడు వరప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా త్రయంబకేశ్వర్, హనుమ గౌడ్, సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీరామ్ లక్ష్మణ్, అశోక్ కుమార్, కార్యదర్శిగా అంజనేయ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

పోస్టుమెన్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్: లయన్స్ క్లబ్ సహారా ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని నిర్వహించారు. అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు బోర్గాం(పి) పోస్టుమెన్ గంగాధర్‌ను సన్మానించారు. తపాలా సేవలు ముఖ్యమైనవని, యూరప్ లాంటి దేశాల్లో ఇప్పటికి వాటికి ప్రాధాన్యం ఉందని జిల్లా కార్యదర్శి చేకూరి ఉదయ సూర్యభగవన్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు

నిజామాబాద్ నేరవిభాగం: ఐదో ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. బాబన్ సాహబ్ పహాడ్ నుంచి అమాన్‌నగర్‌కు వస్తున్న ఇర్ఫాన్‌ఖాన్(33), సయ్యద్ మోస్తిఫ్ ద్విచక్రవాహనాలతో పరస్పరం ఢీకొన్నారు. ప్రమాదంలో ఇర్ఫాన్‌ఖాన్ తలకు, సయ్యద్ మోస్తిఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇర్ఫాన్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

గీత కార్మికులకు రక్షణ కిట్లు అందజేత

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను బీసీ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి రమేష్ కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బుధవారం అందజేశారు. కార్మికులు చెట్టు ఎక్కేటప్పుడు కిట్టును ధరించి ప్రమాదాలకు గురికాకుండా ఉండాలన్నారు. కల్లు గీత కార్మిక సంఘం నాయకులు పెద్ది వెంకట్రాములు, నర్సింలుగౌడ్, శ్రీరాంగౌడ్, శేఖర్‌గౌడ్, అధికారులు నర్సయ్య, శ్రీనివాస్, జయలలిత, గంగాధర్ ఉన్నారు.



దాడి.. ఒకరి రిమాండ్

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : రెండో ఠాణా పరిధిలో దాడి కేసులో ఒకరిని రిమాండుకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన అరుణ్‌కుమార్ భోగిగల్లీలో తన ఇంట్లో కిరాయికి ఉండేవారిని అద్దె అడగడానికి సోమవారం వెళ్లాడు. అదే ప్రాంతంలో ఉండే శివకుమార్ పాత కక్షలతో ఆయనపై దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితుడు అరుణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా బుధవారం శివకుమార్‌ను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించామని ఎస్‌హెచ్‌వో యాసిర్ అరాఫత్ తెలిపారు.

డెంగీతో యువకుడి మృతి

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సదరు యువకుడికి జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయని.. హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్ సూచించడంతో అదే రోజు రాత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. యువకుడి మృతిపై వైద్య సిబ్బంది విచారణ ప్రారంభించారు.

బోరుబావి పూడ్చివేతపై కేసు నమోదు

సిర్పూర్(మోపాల్), న్యూస్‌టుడే: సిర్పూర్‌లో రైతు గోపాల్ వ్యవసాయ బోరు బావిని గుర్తుతెలియని వ్యక్తులు పూడ్చివేశారని.. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ తెలిపారు. రూ.లక్షల్లో ఖర్చు చేసి తవ్వించిన బోరు బావిని పూడ్చివేయడంతో పంటతోపాటు ఆర్థికంగా నష్టపోయినట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు వివరించారు.

పిల్లలు లేరని ఆత్మహత్యాయత్నం

☛ చికిత్స పొందుతూ వివాహిత మృతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వివాహిత మృతి చెందిన ఘటన బోధన్ మండలం ఊట్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కోట్‌పల్లి లక్ష్మి(35)కి పదేళ్ల క్రితం ఊట్‌పల్లికి చెందిన రవితో వివాహమైంది. అప్పటి నుంచి పిల్లలు పుట్టకపోవడంతో జీవితంపై విరక్తిచెందిన ఆమె ఈ నెల 2న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబీకులు వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్కారు దవాఖానాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం చనిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్ రెడ్డి తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. నలుగురికి గాయాలు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఇందల్‌వాయి లక్ష్మీనరసింహాస్వామి ఆలయ సమీపంలో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి గాయాలైనట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ధర్మారం(బీ) గ్రామానికి చెందిన జామపల్లా లక్ష్మి తన అల్లుళ్లు సురేష్, ప్రకాశ్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై బతుకమ్మ పూలకోసం ఇందల్‌వాయి వచ్చారు. పూలు తీసుకొని తిరిగి వెళ్తుండగా ఆలయ సమీపంలో ఇందల్‌వాయికి చెందిన తలారి భూపతి మరో ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళ్లి ఢీకొట్టడంతో నలుగురికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన రూరల్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ ఆరీఫ్ కథనం ప్రకారం.. భీమ్‌గల్ మండలం చెంగల్ గ్రామానికి చెందిన తక్కూరి నర్సయ్య జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ మారుతినగర్ రోడ్ నంబరు-5లోని తన సొంత ఇంట్లో నివాసముంటున్నారు. దసరా సందర్భంగా కుటుంబంతో కలిసి మంగళవారం స్వగ్రామానికి వెళ్లారు. నర్సయ్య బావమరిది మారుతినగర్‌లోనే ఉంటున్నారు. ఆయన బుధవారం ఉదయం ఇంటి ఎదుట ఉన్న లైట్ ఆఫ్ చేయడానికి బావ ఇంటికి వెళ్లగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించి నర్సయ్యకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

ఆర్మూర్
• ఆర్మూర్ • బాల్కొండ

ఆర్టీసీని ప్రయాణికులు ఆదరించాలి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ మెరుగైన రవాణా సౌకర్యం అందిస్తోందని, ప్రయాణికులు ఆదరించాలని ఆర్టీసీ ఆర్ఎం జానీ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్మూర్ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. డిపో మేనేజర్ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎం జానీ రెడ్డి

చిత్రలేఖనం పోటీలు

ఆర్మూర్ గ్రామీణం: కొటార్మూర్ దేవీ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపంలో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం బాల బాలికలకు చిత్రలేఖనం పోటీలు జరిపారు. సొసైటీ గౌరవ అధ్యక్షుడు, కౌన్సిలర్ బండారి ప్రసాద్, అధ్యక్షుడు గుండెం స్వామి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.




కమ్మర్‌పల్లిలో భారీ బతుకమ్మతో మహిళలు

పూల పండుగా..
మనసంతా నిండుగా

న్యూస్‌టుడే, కమ్మర్‌పల్లి

ఏడాదంతా ఎదురుచూసే ఆడబిడ్డల సంబురం వచ్చింది. ఎక్కడెక్కడో ఉంటున్న యువతులు, మహిళలు సొంతూళ్లకు వచ్చారు. నిత్యం తీరొక్క పూలు తెచ్చి శిఖరంలా పేర్చి సాయంత్రం వేళ ఆడిపాడుతున్నారు. వారం రోజుల క్రితం మొదలైన వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. మరికొన్నిచోట్ల దసరా తర్వాత ముగుస్తాయి. తరతరాల వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మను బామ్మ, అమ్మ, కూతురు, అత్త, కోడలు, మనవరాళ్లు.. ఇలా వారసత్వ సంపదగా కీర్తిస్తూ భావితరాలకు అందిస్తున్నారు.

ఆటపాటలతో..

పాటల్లో అనుబంధాలు పెనవేసుకున్నాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు, కుటుంబ సభ్యుల మధ్య ప్రేమలు, ఆప్యాయతలను గుర్తు చేస్తూ ఆడపడుచులు వలయాకారంగా తిరుగుతూ పాటలు పాడుతూ ఆటలు ఆడుతున్నారు. గారెలు, అప్పాలు, వడలు, అట్లు, పూరీలు, అటుకులు, పులిహోరా, పెరుగన్నం, నైవేద్యంగా తయారు చేస్తున్నారు. బతుకమ్మలను ఊరి చెరువుల్లో నిమజ్జనం చేసి వీడ్కోలు పలుకుతారు. వెంట తెచ్చుకున్న సద్దులు ఆత్మీయంగా ఆరగిస్తారు.


చిన్నారులు సందడి

దసరా తర్వాత...

బతుకమ్మ పండుగను ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్, భీమ్‌గల్, మండలాల్లో దసరా పండుగ ముందే ఆడి నిమజ్జనం చేస్తారు. కమ్మర్‌పల్లి, బాల్కొండ, ముప్కాల్, ఏర్గట్ల, మోర్తాడ్ మండలాల్లో ఇంటికి వచ్చిన బతుకమ్మను పండుగ పూర్తయ్యాక పంపించాలనే ఆచారం ఉంది. అందుకే దసరా తర్వాత నిమజ్జనం చేస్తారు.

☛ ఆడబిడ్డ వారసత్వానికి ప్రతీక బతుకమ్మ

☛ పల్లెల్లో కోలాహలంగా వేడుకలు

పువ్వు పువ్వు కోసి.. పూల రాశి చేసి.. పచ్చాలకు పరిచి.. పూలను పేర్చి.. పసుపు కొమ్ము దంచి.. గంగాజలం పోసి.. మునివేళ్లతో గౌరమ్మను చేసి.. నుదుటన కుంకుమ పెట్టి.. బొడ్డెమ్మై కళ్లు తెరిచె.. ఆడబిడ్డల కనుపాపల్లో ఆనందం మెరిసె. రంగుల పూల నడుమ మురిసె ఆ గౌరమ్మ.. బతుకమ్మను పూజించే భాగ్యం మహిళలకు కలిగె.. అందరూ కలిసి ఆట పాటలతో నృత్యం చేస్తూ మైమరిచె.. తరాలు మారినా.. మనసంత బతుకమ్మ.. భావితరాలకు ఆత్మీయ వేడుక.



ఎప్పటికీ మరువం

సాత్విక, నిఖిత, అనూష, ఇంటర్ విద్యార్థినులు



ఈ ఏడాది ఇంటర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించాం. తీరొక్క పూలు తెచ్చి అందరం కలిసి శిఖరంలా పేర్చాం. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడిపాడాం. చిన్నప్పటి నుంచి బతుకమ్మ సంబరాలు జరుపుకుంటున్నాం. ఎక్కడికెళ్లినా బతుకమ్మను మరవం. వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం.

మనవరాళ్లకు నేర్పిస్తున్నా



బతుకమ్మ చేయడం అమ్మ, అమ్మమ్మ నుంచి నేర్చుకున్నా. మా చిన్నప్పుడు అడవికి వెళ్లి పూలు కోసుకొని తెచ్చేవాళ్లం. గ్రామంలో చాలా మందికి బతుకమ్మ పాటలు నేర్పించా. ఇప్పుడు మనవరాళ్లకు నేర్పిస్తున్నా. మా కుటుంబంలో నాలుగో తరం ఈ వేడుకల్లో పాల్గొనేలా చూస్తా.

సరస్వతి, కమ్మర్‌పల్లి

చాలా ఇష్టం

హాసిని, 10వ తరగతి, కమ్మర్‌పల్లి

బతుకమ్మ అంటే ఎంతో ఇష్టం. గునుగు, తంగేడుతో పాటు తీరొక్క పూలు సేకరించడం, బతుకమ్మను పేర్చడం అమ్మమ్మ నుంచి నేర్చుకున్నా. మా బడిలో జరిగిన వేడుకల్లో స్నేహితులతో కలిసి పేర్చా. పాటలు కూడా పాడాను. బతుకమ్మ పేర్చడం గురించి స్నేహితులకు చెప్పా.



హామీలు అమలు చేయాలి

కమ్మర్‌పల్లి, వేల్పూర్, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం పంపిణీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఎన్నికల్లో హామీలు అమలు చేయాలన్నారు. గతంలో కేసీఆర్ దసరా పండుగకు ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు అందించేవారని, ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు బతుకమ్మ చీరలు ఇవ్వలేదన్నారు. ప్రతి మహిళకు రూ 2500, వృద్ధులకు రూ 4 వేల పింఛను ఇంకా ప్రారంభించలేదన్నారు. కేఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, వీఎంసీ ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆర్మూర్ పట్టణం: ఆర్మూర్, పెర్కిట్, మామిడిపల్లిలో 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఆర్మూర్ డీఈ హరిచంద్ బుధవారం తెలిపారు. పట్టణ వాసులు సహకరించాలని కోరారు.

హోమాలు..ప్రత్యేక పూజలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రీనగర్ సరస్వతీ నగర్ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతీ దేవీగా అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా హోమం జరిపారు. అక్షరాభ్యాసాలు, అన్నదానం చేశారు.

కమ్మర్‌పల్లి: కోనసముందర్‌లోని దుర్గాదేవి శరన్నరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్లూర్‌లో అమ్మవారు భక్తులకు సరస్వతిమాత అవతారంలో దర్శనమిచ్చారు.

కిసాన్‌నగర్(బాల్కొండ): కిసాన్‌నగర్ శ్రీరామ మందిరంలో దుర్గాదేవిని బుధవారం సరస్వతి దేవిగా అలంకరించి పూజలు చేశారు.


ఆర్మూర్‌లో


భ్రమరాంబిక యూత్ ఆధ్వర్యంలో..


ఆర్మూర్‌లో ప్రత్యేక అలంకరణలో..


కిసాన్‌నగర్‌లో..


బాల్కొండలో


ఉప్లూర్‌లో


ఆర్మూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తూ...


బతుకమ్మలతో బల్దియా ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కౌన్సిలర్లు

బతుకమ్మ వేడుకలు

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ వేడుకలను జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, కౌన్సిలర్లు, మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు కలిసి బతుకమ్మ ఆడారు. నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, రమణ, హరీష్, నారాయణ రెడ్డి, భోజన్న, కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్(బాల్కొండ): కిసాన్‌నగర్‌లోని శ్రీరామ మందిరం కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. వరద కాల్వలో నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు చిన్నారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


కిసాన్‌నగర్‌లో..

భీమ్‌గల్: మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రేమలత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు నృత్యాలు చేస్తూ.. కోలాటాలు ఆడారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, మేనేజర్ నరేందర్, వార్డు అధికారులు మాణిక్యం, ఆశన్న, సంతోష్, రాజేందర్, నవీన్, కౌన్సిలర్లు లింగం, గంగాధర్, సిబ్బంది ఓంకార్, నవీన్, శ్రీధర్, కాళీదాస్, రఘు, మధు, వికాస్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


భీమ్‌గల్‌లో

సర్వం సిద్ధం

మాక్లూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో బతుకమ్మల నిమజ్జనానికి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు. చెరువుల వద్ద దారులు శుభ్రం చేసి, గుంతలు ఉన్న చోట మట్టిని పోసి చదును చేశారు. కరెంట్ స్తంభాలకు లైట్లు పెట్టించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మాక్లూర్ మండల కేంద్రంలో సుమారు 2 వేల మందికి పైగా మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా చెరువు వద్దకు వెళ్తారు. చెరువు వద్ద ఎల్ఈడీ దీపాలు, రోడ్డు మధ్యలో గుంతలు పూడ్చారు. వేల్పూర్‌లో మహిళలు అల్పాహారం తీసుకునే స్థలం అంతా ట్రాక్టర్లతో చదును చేసి బురద లేకుండా చేశామని వీడీసీ సభ్యులు తెలిపారు. నందిపేట్‌లో చెరువు వద్ద ఫోకస్ లైట్ల ఏర్పాటుతో పాటు రోడ్లపై పిచ్చి మొక్కలు తొలగించారు.


మాక్లూర్‌లో ఏర్పాట్లు చేస్తూ..


కట్టపై చదును చేయించిన పంచాయతీ సిబ్బంది

కాన్షీరాం వర్ధంతి

మాక్లూర్, న్యూస్‌టుడే: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని ధర్మ సమాజ్ పార్టీ నేతలు మాక్లూర్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రేమ్‌కుమార్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో బుధవారం జరిపారు. లింగన్న, కల్లెం భోజన్న, గంగాప్రసాద్, వడ్ల రాజేశ్వర్, సల్ల నర్సయ్య, దాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్(కమ్మర్‌పల్లి): మోర్తాడ్‌లో కాన్షీరాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు ఉమేష్, అనంతరావు, హరీశ్, నవీణ్, శశి తదితరులు పాల్గొన్నారు.


బాల్కొండలో..

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం



డొంకేశ్వర్(మాక్లూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: డొంకేశ్వర్ మండల కేంద్రంలో బుధవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి, కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగి రాములు మహరాజ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డింకేశ్వర్ ఛైర్మన్ భరత్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్లు కొనాలి

వెల్మల్(మాక్లూర్ గ్రామీణం): వెల్మల్ గ్రామంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజలింగం, నల్లన్న, పెద్ద రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

'పేదల వ్యతిరేకి అన్వేష్‌రెడ్డి'

ఆర్మూర్ పట్టణం: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి పేదల వ్యతిరేకి అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి దాసు ఆరోపించారు. బుధవారం ఆర్మూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదును వాపస్ తీసుకోవాలని, పేదలపై ప్రేమ ఉంటే వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. శివాజీ, ప్రిన్స్, వెంకటేశ్, మగ్దుం, సయ్యద్, ఇస్మాయిల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆర్మూర్ పట్టణం: కొత్త బస్టాండ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ లేని వారికి ఎంవీఐ వివేకానందరెడ్డి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ సీఐ రమేశ్, పోలీస్ ఎస్సై గంగాధర్, ఏఎస్ఐ చిన్నయ్య, సిబ్బంది ఉన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

ఆర్మూర్ పట్టణం: గల్ఫ్ దేశాల్లో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రవాస భారతీయుల హక్కులు, సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహం నాయుడు కోరారు. ఏజెంట్ల చేతిలో మోసపోయిన కార్మికులు ఇల్లీగల్‌గా బతుకుతున్నారన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 205, 206 ద్వారా గల్ఫ్‌లో చనిపోయిన కార్మికులకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లింపు అంశంలో మరణ ధ్రువపత్రంతో పాటు, సంస్థలో పని చేసిన వివరాలు, వీసా కాపీలు జతచేయాలన్న నిబంధనతో కార్మికులు నష్టపోతారన్నారు. జీవోను ప్రభుత్వం సవరించాలని కోరారు. ఆయన వెంట న్యాయవాది బాలయ్య ఉన్నారు.

బల్లల వితరణ

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి ప్రభుత్వ కార్యాలయాల వద్ద గణేష్ ఎలక్ట్రికల్ బషీరాబాద్ ఆధ్వర్యంలో 12 సిట్టింగ్ బల్లలను ఏర్పాటు చేశారు. కేఎంసీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, సుంకెట రవి, అబ్దుల్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బాల్కొండ: బాల్కొండ నెహ్రూనగర్ మదీనా కాలనీకి చెందిన ఎండీ ఖాదర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబానికి చేయూతగా రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి రూ. 5000 సాయంగా పంపించారు. పంపించిన డబ్బులను బాల్కొండ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. పార్టీ బాల్కొండ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మైనార్టీ అధ్యక్షుడు జావిద్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్,. ప్రవీణ్‌గౌడ్, సంతోష్‌గౌడ్, వడ్ల రాజేశ్వర్, పురుషోత్తం పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

మాక్లూర్, న్యూస్‌టుడే: ధర్మ సమాజ్ పార్టీ మాక్లూర్ మండల నూతన కార్యవర్గం బుధవారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా పుల్లూరి కిషన్, ఉపాధ్యక్షుడిగా సతీష్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీహరి, శ్రీకాంత్, కోశాధికారిగా మహేష్, కార్యదర్శులుగా శ్రవణ్, ప్రకాష్, సలహాదారులుగా గంగాధర్, సాయన్న, అభిలాష్, శ్రవణ్ ఎంపికయ్యారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నిజామాబాద్ గ్రామీణం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన రూరల్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ ఆరీఫ్ కథనం ప్రకారం.. భీమ్‌గల్ మండలం చెంగల్ గ్రామానికి చెందిన నర్సయ్య జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ మారుతినగర్ రోడ్ నంబరు-5లోని తన సొంత ఇంట్లో నివాసముంటున్నారు. దసరా సందర్భంగా కుటుంబంతో కలిసి మంగళవారం స్వగ్రామానికి వెళ్లారు. నర్సయ్య బావమరిది మారుతినగర్‌లోనే ఉంటున్నారు. ఆయన బుధవారం ఉదయం ఇంటి ఎదుట ఉన్న లైట్ ఆఫ్ చేయడానికి వెళ్లగా.. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించి నర్సయ్యకు, పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.